# బాలమిత్ర

- వాసంతి మాఘుపు.

రామాయణములో ముఖ్యమైన సంఘటనలను తెలియజేస్తూ, రామాయణమును ఒక వాక్యంలో చెప్పారు మన పూర్వులు. అది తెలుసుకుందాం!

పూర్వం రామ తపోవనాదిగమనం,
హత్వ మృగం కాంచనం,
వైదేహి హరణం, జటాయు మరణం,
సుగ్రీవ సంభాషణం,
వాలి నిగ్రహణం, సముద్రతరణం,
లంకాపురి దహనం,
పశ్చాత్ రావణ కుంభకర్ణ హననం
ఏతత్ హి రామాయణం.

**పద్యం:** పనులెన్ని కలిగియున్నను
దిన దినముల విద్యసెంపు ధీయుక్తుడవై
వినగోరుము సత్కథలను
కని విబుధులు సంతసించు గతిని గుమారా!

**అర్థం:** నీకు ప్రతిరోజూ ఎన్ని పనులు ఉన్నప్పటికిని, విద్యయందలి గౌరవముతో, పెద్దలందఱును మెచ్చుకొనునట్లుగా మంచి మంచి కథలను పరిశీలించి వినుచుండుము.

**సూక్తి:** అతి భాష మతి హాని
మిత భాష అతి హాయి.

**అర్థం:** అతిగా మాట్లాడడమువలన మతి (మనస్సు) కుదురుగా ఉండదు. చంచలముగా ప్రవర్తిస్తుంది. మితముగా మాట్లాడడమువలన ఎంతో ప్రశాంతత ఏర్పడుతుంది. అది ఎంతో హాయినిస్తుంది.

## పదమేంటో చెప్పుకోండి!

క్రింద ఇచ్చిన ఆధారములనుపయోగించి పదమేంటో చెప్పుకోండి!

1. ఇది 5 అక్షరముల ఊరి పేరు.
2. చివరి మూడు అక్షరములు పెళ్ళికాని ఆడువారి సంబోధనను తెలియజేస్తాయి.
3. మొదటి అక్షరం, చివరి అక్షరం కలిసి ఏనుగును తెలియజేస్తాయి.
4. మొదటి రెండు అక్షరములు, చివరి మూడు అక్షరములు ఒక రకమైన అర్థాన్నే ఇస్తాయి. పెళ్ళంటే ఈ దానమే!

**ఏమిటా పదం?**

## సమాధానం చెప్పగలరా? ప్రయత్నించండి!

1. ఈ కారు స్పీడేవేరు. కాని చక్రాలమీద నడవదు. కాళ్లపైనే నడుస్తుంది. ఏమిటి?
2. పంచినకొద్దీ పెరిగేది ఏమిటి?

(సమాధానములు వచ్చే సంచికలో)

గత సంచికలోని **'సమాధానం చెప్పగలరా?'** సమాధానములు.

1. మూడు కళ్ళున్నా చూడలేనిది కొబ్బరి.
2. నాలుగు కాళ్ళున్నా నడవలేనిది కుర్చీ.
3. 'తంతా' అంటే కదిలేది. 'అమ్మా-బొమ్మ' అంటే కదలనిది నాలుక.
4. గాలి వీచినా హరీ అంటుంది. గాలి అసలు లేకపోయినా హరీ అంటుంది దీపం.


*చనిపోయిన తర్వాత కూడా ప్రజలు మిమ్మల్ని మరచి పోకుండా ఉండాలంటే -*
*చదవ దగ్గ పుస్తకాలు రాయండి లేదా రాయదగ్గ పనులను చేయండి.*




## మంగలిషాపు

వివేక్ అను పేరు కలిగిన ఒక వ్యక్తి క్షవరము, గడ్డము చేయించుకోడానికి మంగలి షాపుకు వెళ్ళాడు. మంగలి తన పని చేసుకుంటూ, ఆ మాట ఈ మాట అయ్యాక, దేవుని గురించి ప్రస్తావన వచ్చింది. మంగలి తాను దేవుని నమ్మనని చెప్పగా, ఆ వ్యక్తి కారణము అడిగెను. దానికి మంగలి "ఒక్కసారి బయటకుపోయి చూస్తే దేవుడు లేడనే విషయము అర్థమవుతుంది. దేవుడే ఉన్నట్లయితే, అంతమంది రోగులు, అనాధలు ఉంటారా? దేవుడే ఉంటే ఈ బాధలు, కష్టాలు ఉండేవి కాదు కదా! ప్రేమను కలిగిన దేవుడే ఉంటే ఇలాంటి పరిస్థితులు ఏర్పడతాయని నేననుకోను." అని సమాధానము చెప్పెను. మంగలి మాటలు విని, వివేక్ కాస్తంత ఆలోచించి, వాగ్వివాదమునకు ఇష్టపడక, అప్పటికి మౌనము వహించి, మంగలి తన పని పూర్తిచేసిన పిదప షాపునుండి బయటపడెను.

మంగలి షాపునుండి బయటపడిన కొద్దిసేపటికి - గడ్డము మాసి, జుత్తు ఎక్కువగా పెరిగి, క్షురకుని చూసి సంవత్సరములు గడిచినట్లు తోచేవిధముగా కనిపిస్తున్న ఒక వ్యక్తి వివేక్‌కు ఎదురు పడ్డాడు.వివేక్ వెనుకకు తిరిగి క్షురకునివద్దకు పోయి "నీకు తెలుసా? క్షురకులనేవారు అసలు లేరు!" అనెను. "అది ఎలా చెప్పగలవు?" అని మంగలి ఆశ్చర్యముతో ప్రశ్నిస్తూ, "నేను మంగలినే కదా! నీ ఎదురుగానే ఉన్నాను కదా! పైగా నీకు ఇదివరకే క్షవరము చేసినాను కదా!" అనెను. "లేదు. క్షురకుడే ఉన్నట్లయితే, అక్కడ కూర్చున్న వ్యక్తిలాగ గడ్డం మాసినవారు, దుమ్ము పట్టిపోయిన పొడవైన జుత్తుకలవారు ఉండకూడదు కదా!" అని వివేక్ ప్రశ్నించెను. "ఆహా! క్షురకులున్నారు! ఎవరైనా కాని అప్పుడప్పుడు మా దగ్గరకు రాకపోతే, వారి జుత్తు పెరుగుతుంది, గడ్డం మాస్తుంది." అన్న మంగలితో "అవునుకదా! అదే విధముగా దేవుడు కూడా ఉన్నాడు! కాని, దేవుని ఆశ్రయించకుండా, ఆయన సహాయము అర్థించకుండా జనులు ప్రవర్తించడమువలననే ఈ కష్టాలు, బాధలు" అని వివేక్ తెలియజెప్పెను.




భగవాన్ శ్రీ సత్యసాయిబాబా గారు ఈ విధముగా చెబుతారు "ఎవరైనా మిమ్మల్ని 'దేవుని చూపించగలవా?' అని అడిగితే, దేవుడు మీలోనే ఉన్నాడని, ఆ కారణముగానే నీవు మాట్లాడుతున్నావని, పనులు చేసుకుంటున్నావని తెలియజెయ్యండి. దైవత్వం గురించి తెలుసుకోవాలంటే, నీలోని నిర్మలమైన, పవిత్రమైన తత్వాన్ని తెలుసుకోవాలి. నోటిలో ఉప్పును ఉంచుకుని తీపిని రుచిచూడగలమా? నోటిని శుభ్రం చేసుకుని, ఉప్పదనాన్ని తొలగించుకుంటే, తీపి తెలుస్తుంది. ప్రాపంచకమైన వాంఛలు ఉప్పులాంటివి. వాటిని విడిచిపెడితే, దైవత్వాన్ని అనుభవపూర్వకముగా తెలుసుకోవచ్చు.